క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ లావణ్య

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కమిషనర్ సమ్మయ్యకు 26వ వార్డు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య వినతిపత్రం సమర్పించారు. వార్డులో వివిధ సమస్యలున్నాయని, వెంటనే పరిష్కారం చేయాలని వినతిపత్రంలో కోరారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

హుజూరాబాద్: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సీఐ తిరుమల్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ఇల్లందకుంటకు చేరుకున్న సైకిల్ యాత్ర


శ్రీనివాస్‌పటేల్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఇల్లందకుంట: తెలంగాణ ఉద్యమకారుల హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వానికి శక్తిని అందించాలని టీయూఎఫ్ ప్రచార కార్యదర్శి కుడిది శ్రీనివాస్‌పటేల్ 41 రోజుల అయ్యప్ప దీక్ష, దేవాలయాల సందర్శన సైకిల్‌యాత్రను చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం సైకిల్‌యాత్ర మండలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయానికి చేరుకుంది. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం యువజన విభాగం రాష్ట్ర కో కన్వీనర్ అన్నం ప్రవీణ్, హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు ఊకంటి మల్లాచారి, మండల అధ్యక్షుడు రాజబాబు శ్రీనివాస్‌కు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. యాత్ర విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కారింగుల రాజేందర్, గైకోటి రాజు, కుమారస్వామి, బుడిగె శ్రీకాంత్‌యాదవ్, అరుణ్‌రెడ్డి, బిజిగిరి శ్రీకాంత్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ఆశీర్వదించాలి


మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

శంకరపట్నం: ప్రజా ఆశీర్వాదంలో ఐదుసార్లు కరీంనగర్ కార్పొరేటర్‌గా గెలిచానని మాజీ మేయర్ రవీందర్‌సింగ్ అన్నారు. ఎమ్మెల్సీకి మద్దతు తెలపాలని మండలంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను గురువారం అభ్యర్థించారు. అనంతరం కేశవపట్నంలో విలేకర్లతో మాట్లాడారు. స్వతంత్రులుగా ప్రొఫెసర్ కొదండరాం, తీన్మార్ మల్లన్న గెలవలేక పోయారని, రాజకీయపార్టీల మద్దతుతోనే విజయం సాధించారని, ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయపార్టీలతో ముడిపడి ఉన్నాయన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డికి ఏటా రూ. కోట్ల ఆదాయం వస్తుందన్నారు. రూ. కోట్లు ఖర్చు పెట్టే స్తోమత తనకు లేదన్నారు. మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌ను డీఈవో ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించి ప్రభుత్వ టీచర్లను అవమానపర్చారని ఆరోపించారు. దివంగత రాష్ట్రపతి అబ్దుల్‌కలాం, ప్రధాని పీవీ.నర్సింహారావు ప్రభుత్వ పాఠశాలలో చదివి మేధావులయ్యారని, ఎమ్మెల్సీగా ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, మాజీ సర్పంచ్ చొడమల్ల వీరస్వామి పాల్గొన్నారు.

వంట సామగ్రితో శబరిమలకు


వంటసామగ్రితో వెళ్తున్న ట్రస్ట్ సభ్యులు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామం నుంచి శబరిమలకు వంటసామగ్రితో అయ్యప్పసేవా ట్రస్ట్ సభ్యులు గురువారం బయలుదేరారు. శబరిమలలో ఈ నెల12, 13, 14న మకరజ్యోతి దర్శనం కోసం వచ్చే దీక్షాపరులకు భిక్ష అందించేందుకు అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యులు, వంటసామగ్రితో వాహనంలో తరలివెళ్లారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు జనగాం శ్రీనివాస్, బండి కుమారస్వామి, కర్నాల రంజిత్, రోహిత్ తదితరులు వెళ్లారు.

ఊరూరా ఈతవనం

- నర్సరీల్లో మొక్కల పెంపకానికి ప్రాధాన్యం
- విత్తనాల కోసం ఇబ్బందులు
- మానకొండూర్ మండలంలో పరిస్థితి

మానకొండూర్: ఉపాధి హామీ పథకంలో ఊరూరా ఈతవనాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. 2024–25 సంవత్సరానికి గ్రామాల్లోని ఈజీఎస్ నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు, పూలు, పండ్ల జాతి మొక్కలు పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సారి గ్రామాల్లో ఈతవనాలు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఇప్పటికే నర్సరీల్లో ఈత మొక్కలు పెంచేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేసి మొక్కలను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో నర్సరీల్లో పది నుంచి 13 వేల మొక్కలు పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో సారవంతమైన మట్టిని ట్రాక్టర్ల ద్వారా నర్సరీలకు తరలించి, కూలీలతో జల్లెడ పట్టించి మరింత సారవంతంగాతయారు చేశారు. చిన్నచిన్న బ్యాగుల్లో మట్టిని నింపి వివిధ రకాల పండ్లు, పూల జాతి మొక్కల విత్తనాలు నాటి పెంచుతున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం గ్రామాల్లో ఈత వనాలు పెంచాలని ప్రభుత్వం యోచిస్తుండగా అధికారులు ఆదిశగా అడుగులు వేస్తు నర్సరీల్లో ఈత మొక్కలు పెంచేందుకు చర్యలు చేపట్టారు. ఈత మొక్కలను అన్నీ గ్రామాల్లో పెంచి కల్లుగీతా కార్మికుల ఆదాయాభివృద్ధిని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఈత విత్తనాలు లభ్యత తక్కువగా ఉండటంతో ఉపాధిహామీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి అన్ని నర్సరీల్లో కొంత శాతం ఈత మొక్కలు పెంచడానికి విత్తనాల కొరత ఏర్పడింది. విత్తనాలు, మొక్కల కోసం సిబ్బంది, చాలా ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు ఎక్కడ దొరక్కపోవడంతో చేసేది లేక కూలీలతో ఆయా గ్రామాల్లోని ఈతచెట్ల కింది మొలకలకు సేకరించి నర్సరీల్లోని ఏర్పాటు చేసిన బ్యాగులో నాటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే చెరువు గట్ల వెంట వీటిని నాటించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రతి నర్సరీల్లో ఈత మొక్కలు ఒక్క బెడ్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉండటంతో విత్తనాల కొరత, మొక్కల కోసం ఇబ్బందులు తప్పడం లేదు.


బ్యాగుల్లో ఈత మొలకలు నాటుతున్న కూలీలు


సేకరించిన ఈత మొలకలు

గీతకార్మికులకు ఆదాయం



గ్రామాల్లో చాలా వరకు ఈత వనాలు తగ్గిపోయాయి. దీంతో కల్లుగీత వృత్తిపై ఆధారపడ్డ గౌడన్నలకు ఆదాయం సమకూరడం లేదు. ఈత వనాలు పెంచితే గౌడన్నలు ఆర్థికంగా నిలదొక్కుకుంటారు.

– నల్లగొండ తిరుపతి, గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు



సాక్షి స్పందన

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో మిషన్‌భగీరథ పైపులైన్ లీకేజీకి మరమ్మతు చేశారు. ఈ నెల 1న 'సాక్షి'లో ప్రచురితమైన వాట్సాప్ కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిషన్‌భగీరథ సిబ్బందితో లీకేజీకి మరమ్మతు చేయించారు. ఏడాదిగా ఎవరూ పట్టించుకోని సమస్యను 'సాక్షి' ప్రచురితం చేయడంతోనే అధికారులు స్పందించారని పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

తప్పుడు కేసులకు భయపడొద్దు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కవిత, నాయకులు

తిమ్మాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నందుకే బీఆర్‌ఎస్ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారని, వాటికి భయపడొద్దని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి మాజీ ఉప సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు పొన్నం అనిల్‌గౌడ్ రూపొందించిన 2025 క్యాలెండర్‌ను గురువారం ఆమె కరీంనగర్‌లో ఆవిష్కరించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు పోరాడాలని సూచించారు. రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, గొట్టం మహేశ్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

చొప్పదండి: పట్టణ శివారులోని శివకేశవ ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు పూర్తి చేశారు. వివేకానంద యూత్ క్లబ్ సభ్యులు, నిర్వాహకులు ఏటా ఏర్పాట్లు చేస్తారు.

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం,రైల్వే స్టేషన్ అవరణలోని శ్రీరామాలయం, కొత్తపల్లి శ్రీభక్తాంజనేస్వామి దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు జితేంద్రగుప్తా, ఆంజనేయస్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బొద్దుల రవీందర్ కోరారు.

ఇల్లందకుంట: అపరభద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం వైకుంఠ ఏకాదశికి మస్తాబయింది. ఉత్తర ద్వార దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఉదయం ఐదుగంటల నుంచే దర్శనం చేసుకోవచ్చని ఆలయ ఈవో కందుల సుధాకర్ తెలిపారు. ప్రధాన అర్చకులు శేషం రామాచార్యులు మాట్లాడుతూ...ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే భక్తులకు శుభం కలుగుతుందన్నారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు భక్తులకు ఉత్తర ద్వార దర్శనంగావిస్తారని ఆలయ ఈఓ రాజ్‌కుమార్ గురువారం తెలిపారు. వేకువజాము నుంచి దర్శనం ప్రారంభమవుతుందని, మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతారని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నూతన ఉత్సవ కమిటీ సభ్యులను కూడా నియమించినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

రైతులకు అవగాహన

ఇల్లందకుంట: జీరో టిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్న సాగు చేస్తే పెట్టుబడి వ్యయం తగ్గడంతోపాటు రైతులకు సమయం ఆదా అవుతుందని కేవీకే శాస్త్రవేత్త విజయ్ అన్నారు. గురువారం మండలంలోని వాగొడ్డు రామన్నపల్లి పరిధిలో నేరుగా విత్తిన వరి, జీరో టిల్లేజ్ పద్ధతిలో సాగుచేసిన మొక్కజొన్నను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొక్కజొన్నలో భాస్వరం లోపం గుర్తించామని, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో సంపత్‌కుమార్‌యాదవ్, రైతులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో చెక్‌డ్యామ్‌కు మరమ్మతు

ఇల్లందకుంట: పాతర్లపల్లి పరిధిలోని చెక్‌డ్యామ్‌కు గండిపడగా యాసంగి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. మరమ్మతు చేయాలని అధికారులకు తెలియజేస్తే నిధులు లేవు మీరే చేసుకోవాలన్నారని, చెక్‌డ్యామ్‌పై ఆధారపడి పంటలు సాగుచేస్తున్నాం ఆర్థికంగా నష్టపోతున్నామని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని భావించిన గ్రామంలోని నలభైమంది రైతులు సొంతఖర్చులతో గండిని పూడ్చారు. శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులను గురువారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు విచారిస్తున్న నేపథ్యంలో పోలీసులు నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు

జమ్మికుంట: మున్సిపల్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావును హౌజ్ అరెస్ట్ చేశారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులను ముందుస్తు అరెస్ట్ చేసి అనంతరం విడుదల చేశారు.

నిధులు మంజూరు

రామడుగు: మండలంలోని పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఉపాధి హామీ నిధులు మంజూరు చేయించారని మండల అధ్యక్షులు ఒంటెల కరుణాకర్‌రెడ్డి తెలిపారు. నిధుల కేటాయింపునకు కృషి చేసిన సంజయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైకుంఠరథం వితరణ



మానకొండూరు: ముంజంపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి వేల్పుగొండ లింగయ్య తల్లిదండ్రులు గట్టయ్య లస్మమ్మ, సోదరుడు రాజయ్య స్మారకార్థం రూ.మూడున్నర లక్షలతో తయారుచేయించిన వైకుంఠరథాన్ని గ్రామపంచాయతీకి వితరణ చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మాజీ సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాలెంకి మల్లేశం తదితరులు ఉన్నారు.

క్రైం వార్తలు

విద్యుత్ మోటారు చోరీ

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఎస్సారెస్పీ ఉపకాలువకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్ చోరీకి గురైందని రైతులు తెలిపారు. గ్రామానికి చెందిన రైతు లింగారెడ్డి గురువారం తెల్లవారుజామున వ్యవసాయపొలం వద్దకు వెళ్లగా మోటారు చోరీ చేశారని గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

శంకరపట్నం: తాడికల్ శివారులో గురువారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొనడంతో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. హుజూరాబాద్ డిపోకు చెందిన బస్సు కరీంనగర్ నుంచి ప్రయాణికులతో హుజూరాబాద్ వెళ్తుండగా రామగుండం నుంచి ఖమ్మం వెళ్తున్న ఫ్లైయాష్ లారీ బస్సును వెనక నుంచి ఢీకొట్టింది. బస్సు అద్దాలు పగలడంతో వెనక సీట్లో కూర్చున్న కరీంనగర్ చెందిన కృష్ణవేణి, జ్యోతికి గాయాలు కాగా పోలీసులు హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి గురువారం తెలిపారు. తనుగుల కు చెందిన జూపాక ప్రశాంత్ అనుమతి లేకుండా ట్రాక్టర్‌తో ఇసుక రవాణా చేస్తుండుగా పట్టణంలోని కొత్తపల్లి వద్ద పట్టుకున్నామని వివరించారు.

నియామకం

సైదాపూర్: బీజేపీ సైదాపూర్ మండల అధ్యక్షుడిగా అమ్మనగుర్తి గ్రామానికి చెందిన దెంచనాల శ్రీనివాస్‌ను నియమించినట్లు సిద్దిపేట జిల్లా బీజేపీ ఎన్నికల అధికారి సారంగుల అమర్నాథ్ గురువారం ప్రకటించారు. బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పార్టీ పటిష్టతకు చురుకుగా పనిచేసిందుకు, శ్రీనివాస్ పనితీరును గుర్తించి మండల అధ్యక్షుడిగా నియమించామని అమర్నాథ్ పేర్కొన్నారు. నియామకానికి కృషి చేసిన కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, మండల నాయకులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

చిగురుమామిడి అధ్యక్షుడిగా..

చిగురుమామిడి: బీజేపీ చిగురుమామిడి మండల అధ్యక్షుడిగా పోలోజు సంతోష్‌కుమార్‌ను ఎంపికచేస్తూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేటలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో సంతోష్‌కుమార్‌ను నియమిస్తున్నామని ప్రకటించారు. సంతోష్‌కుమార్ గ్రామ, మండల, జిల్లా స్థాయిలో చురుగ్గా పని చేశారు. మండల ప్రధానకార్యదర్శిగా పనిచేసి ప్రస్తుతం బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. తన నియామకానికి సహకరించిన కేంద్రమంత్రి బండి సంజ్‌కుమార్, రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు.

25 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూరాబాద్: సంగారెడ్డి జిల్లాలో 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే సీపీఎం రాష్ట్ర నాల్గో మహాసభల కరపత్రాలను గురువారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు పార్టీ నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఆరు గ్యారెంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రమేశ్, చంద్రయ్య, సభ్యులు, చిరంజీవి, మోర మహేశ్, చేరాలు, రాసపల్లి శంకర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


అధ్యక్షులను సన్మానిస్తున్న మహిళా లీడర్లు

హుజూరాబాద్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ మండల మహిళా అధ్యక్షురాలు లంకదాసరి లావణ్య ఆధ్వర్యంలో పట్టణ, మండల అధ్యక్షులు మేకల తిరుపతి, కొల్లూరి కిరణ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లీడర్లు దుబాసి స్వరూప, అంబాల కోమల, బూరుగుల శృతి, శనిగరం తిరుమల,దీపిక తదితరులు ఉన్నారు.

హుజూరాబాద్‌లో...


శంకర్‌ను సన్మానిస్తున్న వాకర్స్ సభ్యులు

హుజూరాబాద్: హనుమాన్ దేవాలయ కమిటీ ధర్మకర్తల మండలి డైరెక్టర్ భూసారపు శంకర్‌ను పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు ప్రతాప శ్రీనివాస్, ప్రతాప రమేష్, భూసారపు శ్రీనివాస్, పంజాల రవీందర్, మల్లన్న, శరత్, నరేందర్, రాంరెడ్డి, సురేందర్ రావు, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, టీచర్లు

గన్నేరువరం: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో గుండ్లపల్లి ఎస్ఎల్ఎన్ స్పార్కిల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ కనబరించారు. జనవరి 5న మంచిర్యాల జిల్లా సోమ గూడెంలో జరిగిన కుంగ్‌ఫూ పోటీల్లో శివ, ఆదిత్య, శశి, ధనుష్, శివానిలు బంగారు పతకాలు, భావజ్ఞ వెండి పతకం సాధించారు. పాఠశాలలో కరాటే మాస్టర్ ఎలగందుల శ్రీనివాస్, విద్యార్థులను ప్రిన్స్‌పాల్ ఆంజనేయులు గురువారం అభినందించారు. కుంగ్‌ఫూ, జుడో, వూషూ, మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు రాణించడం హర్షనీయమన్నారు. కరస్పాండెంట్ సంపత్, అకాడమిక్ డైరెక్టర్ సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివేకానంద జయంతి

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం రామడుగు మండల ధర్మజాగరణ సమన్వయ విభాగం ఆధ్వర్యంలో వివేకానంద జయంతి నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు పాకాల రాములుగౌడ్, ఎడవెల్లి పాపిరెడ్డి, రామకృష్ణ, పూజారి రమణాచారి పలువురు పాల్గొన్నారు.

ఫాతిమాను ఆదర్శంగా తీసుకోవాలి


నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం స్కూల్‌లో గురువారం మొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, ఫాతిమాను ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ వినోద్ కుమార్, కౌన్సిలర్లు ఉజ్మా నూరిన్, యాదగిరి నాయక్, జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ జలీల్, అధికార ప్రతినిధి బాబు, అంబేడ్కర్ కమిటీ చైర్మన్ ఖలీద్, జ్యోతిరావు పూలే కమిటీ చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ టౌన్, మండల ప్రెసిడెంట్లు తిరుపతి, కిరణ్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, రత్నం, ఎండీ. అఫ్సర్, బాబా, మున్ను, అజ్జు, తౌసిఫ్, అలీమ్, మధు, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

రామ శ్రీనివాస్‌కు నివాళి



హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద గురువారం రాష్ట్ర పద్మశాలీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామ శ్రీనివాస్ వర్ధంతి నిర్వహించారు. సంఘం నాయకులు రామశ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళిఅర్పించారు. అనంతరం బీసీ ఆజాదీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ మాట్లాడారు. పద్మశాలీలు ఐక్యంగా భవిష్యత్ తరాల కోసం పోరాటం చేయాలన్నారు. నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, చిరంజీవి, సాగర్, రామచంద్రం, దేవయ్య, యాదగిరి, రాజేందర్, అశోక్, వెంకన్న, సంపత్, భిక్షపతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ




మానకొండూర్: ప్రభుత్వ గురుకులాల్లో చేరండి విజేతలుగా నిలువండి అనే నినాదంతో ముద్రించిన గురుకులాల కామన్ ఎంట్రిన్స్ టెస్ట్ పోస్టర్‌ను దేవంపల్లి గురుకుల పాఠశాలలో గురువారం డీఆర్‌డీవో శ్రీధర్, మానకొండూరు ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ జగన్నాథం ఆవిష్కరించారు. సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ కొమురయ్య, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రబియ, టీచర్లు, పేరెంట్స్ మొగురం రమేశ్, శ్రీనివాసు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత



చొప్పదండి: మండంలోని చాకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు తీసుకుంటున్న చర్యలను రామడుగు మండలం వెలిచాలకు చెందిన నర్సయ్య గుర్తించాడు. గురువారం విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా అందించారు. నర్సయ్యను హెచ్ఎం కలికోట తిరుమల్ అభినందించారు. లీడర్ శకుంతల, టీచర్లు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, అనీస్ ఫాతిమా, జంపాల వనిత, తదితరులు పాల్గొన్నారు.

బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్‌కు అవార్డు



తిమ్మాపూర్: ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ ఎన్. నరేశ్‌కుమార్ 2024 సంవత్సరానికి బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు సాధించాడు. ఈమేరకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. విధుల్లో చురుకుదనం చూపిస్తూ అవార్డు సాధించిన నరేశ్‌కుమార్‌ను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్వామి, ఎస్సై వివేక్ అభినందించారు. అనంతరం తోటి సిబ్బంది నరేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.